నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 11 జూన్ 2025 | VIKARABAD

ఈ నెలాఖరు వరకు రేషన్ బియ్యం సరఫరా

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జూన్ 10 : జూన్‌లో మూడు నెలలకు (జూన్, జులై, ఆగస్టు) సంబంధించిన సన్న రేషన్ బియ్యం సరఫరా చేయుటకు ప్రభుత్వం ఆదేశించిందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సంబంధిత రేషన్ షాప్‌లకు బియ్యాన్ని పంపించినట్లు పేర్కొన్నారు. కార్డుదారులందరూ జూన్ 30 వరకు బియ్యాన్ని సంబంధిత రేషన్ షాపుల్లో పొందవచ్చని ఆయన చెప్పారు.

ఫ్యాక్టరీని మూసేయాలని ధర్నా

పశు వ్యర్థాలతో వెళుతున్న లారీలను అడ్డుకొని నిరసన చేపట్టిన దోర్నాల్ గ్రామస్తులు

దోర్నాల్ గ్రామంలో పశు వ్యర్థాలతో వెళుతున్న లారీలను అడ్డుకున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు, జూన్ 10: మరియా ఫ్యాక్టరీని వెంటనే తొలగించాలని దోర్నాల్ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. మంగళవారం ధారూరు మండల పరిధిలోని దోర్నాల్ గ్రామ శివారులోని సర్వే నం.113లో గల మరియా ఫీడ్ కంపెనీకి చెందిన పశు వ్యర్థాల లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. రెండు మూడు రోజుల నుంచి చుట్టుపక్కల ప్రాంత రైతులకు వాసన రావడంతో అధికారులకు సమాచారం చేరవేశారు. గ్రామస్తులు సోమవారం రాత్రి పశు కళేబరాలతో వెళుతున్న లారీలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం దోర్నాల గ్రామంలో ప్రజలు భారీగా తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ సాజిదావేగం, సీఐ రఘురాం, ఎస్సై అనిత సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు.

రెండు, మూడు రోజులుగా ఫ్యాక్టరీ నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో అస్వస్థతతోపాటు వాంతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో పశు వ్యర్థాల వాహనాలను గ్రామంలోకి తీసుకువచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీని శాశ్వతంగా నిలిపివేయాల డిమాండ్ చేశారు. 2016లో కోళ్ల దాణా పేరుపై పర్మిషన్ తీసుకుని పశు కళేబరాలతో నూనెకు సంబంధించిన పదార్థాలు తయారుచేస్తున్నారు. ఎన్నోసార్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం ధర్నాలు, ఆందోళన చేసినా నామమాత్రంగా మూసివేసి మళ్లీ తిరిగి ప్రారంభించడం ఆనవాయితీగా మారింది. ఫ్యాక్టరీపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మరియా ఫ్యాక్టరీని సీజ్ చేస్తున్నట్లు వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర తెలిపారు.

రేపటి నుంచి బస్ పాస్‌లు జారీ

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు బస్ పాస్‌ల జారీ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమవుతుందని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్‌లో ఆరాంఘర్, అఫ్జల్‌గంజ్, బాలానగర్, బోరబండ, సీబీఎస్,చార్మినార్, దిల్‌షుక్‌నగర్, ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్, ఫరూక్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, జేబీఎస్, కాచిగూడ, కోఠి, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, లక్డీకపూల్, ఎల్‌బీనగర్, లింగంపల్లి, లోతుకుంట, మేడ్చల్, మెహిదీపట్నం, మిథాని, మొయినాబాద్, ఎన్‌జీఓ కాలనీ, పఠాన్‌చెరు, రైతిఫైల్ సికింద్రాబాద్, ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్, సనత్‌నగర్, సెక్రటేరియట్, శంషాబాద్, ఎస్ఆర్‌నగర్, షాపూర్‌నగర్, తార్నాక, ఉప్పల్, ఉమెన్స్ కాలేజీ కోఠి కేంద్రాల్లో పాస్‌లు పొందొచ్చని వివరించారు. సమాచారం కోసం 80082042 16, tgsrtcpass.comను సంప్రదించవచ్చన్నారు.

మోగనున్న బడిగంట

రేపటి నుంచి పాఠశాలలు ప్రారంభం

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : వేసవి సెలవులు ముగిశాయి. గురువారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఇక ఎప్పటిలాగానే బడి గంటలు మోగనున్నాయి. సెలవుల్లో హాయిగా, ఆనందంగా గడిపిన చిన్నారులు ఇక భుజాన బ్యాగులు వేసుకుని బడికి వెళ్లే సమయం ఆసన్నమైంది. ఇప్పటికే పిల్లలు, తల్లిదండ్రులు ఈ ఏడాదికి సంబంధించిన స్టేషనరీ, బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లు తదితర సామగ్రి కొనుగోళ్లతో నగరంలోని స్టాల్స్ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు సర్కార్ బడులు విద్యార్థులను ఘనంగా ఆహ్వానించేలా తరగతి గదులను డెకరేషన్ చేయించడానికి సన్నాహాలు చేస్తున్నారు. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రవాణా శాఖ పరిధిలో 12,842 విద్యాసంస్థల బస్సులు ఉన్నాయి. కాగా, కొన్ని ఇంటర్నేషనల్ స్కూల్స్ ఇప్పటికే ప్రారంభం కాగా, అధిక శాతం స్కూళ్లు గురువారం ప్రారంభం కానున్నాయి.

బాల్యంపై బరువులొద్దు..!

స్కూల్ బ్యాగ్ బరువు ఎంత పెరిగితే అంత గొప్ప స్కూల్‌గా పోటీ పడుతున్నాయి నేటి పాఠశాలలు. కేవలం వారి తరగతికి సంబంధించిన పుస్తకాలే కాకుండా అదనంగా కొనుగోలు చేయిస్తూ తల్లిదండ్రుల నుంచి డబ్బులు గుంజుతున్నాయి. దీంతో వయసుకు మించి బరువున్న బ్యాగులను మోస్తూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రతి ఏడాది స్కూల్స్ ప్రారంభమవగానే విద్యార్థుల బ్యాగుల బరువుపై విద్యాధికారులు దృష్టి సారించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటికీ అటు ఫీజులు విషయంలోనూ.. ఇటు బ్యాగుల బరువు విషయంలోనూ గ్రేటర్‌లో అధికారులు దృష్టి సారించడంలేదు. విద్యాశాఖ స్కూల్ బ్యాగుల బరువుపై గతంలో ఎంత ఉండాలో తరగతి లెక్కన ఆదేశాలు జారీ చేసింది. ఆ నిబంధనలను పాఠశాలలు గాలికొదిలేశాయి. 7 నుంచి 17 కిలోల వరకు స్కూల్ బ్యాగుల బరువు ఉంటున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తరగతి	సంచి బరువు (కిలోల్లో)
1–2	1.5
3–6	2–3
6–7	4
8–9	4.5
10	5

నవాబుపేట : ఓ ఇంటి ఎదుట డ్రైనేజీ నుంచి లీకై రోడ్డుపై పారుతున్న మురుగు

నిధులు లేక పడకేసిన పాలన

వారానికి ఒక్కరోజు కూడా గ్రామపంచాయతీలకు రాని ప్రత్యేకాధికారులు

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు ఆగిపోవడం, మరోవైపు గ్రామపంచాయతీల్లో పాలన చూడాల్సిన ప్రత్యేకాధికారులు పత్తా లేకుండా పోవడంతో గ్రామపంచాయతీల్లో పాలన అధ్వానంగా మారింది. కాంగ్రెస్ సర్కారు నయా పైసా కూడా విదల్చకపోవడంతో పంచాయతీ కార్మికులకు కూడా జీతాలు అందని పరిస్థితి నెలకొన్నది. జిల్లా ఉన్నతాధికారులు గ్రామపంచాయతీల్లో పర్యటించేందుకు వస్తే తప్ప ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీలకు రావడంలేదని ప్రజలు చెబుతున్నారు. కనీసం వారానికి ఒక్కరోజు కూడా గ్రామాలకు ప్రత్యేకాధికారులు రాకపోవడంతో గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకాధికారులు బాధ్యతలను విస్మరించడంపై కలెక్టర్ సీరియస్ అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతున్నది.

- వికారాబాద్, జూన్ 10 (నమస్తేతెలంగాణ)

- సమస్యలు చెప్పకొనేందుకు ఎవరూ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రత్యేకాధికారులు బాధ్యతలను విస్మరించడంపై కలెక్టర్ సీరియస్
- మరోవైపు నిధుల్లేక పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యలు
- నయా పైసా నిధులివ్వని కాంగ్రెస్ సర్కారు
- పంచాయతీ కార్మికులకు జీతాలు అందక అవస్థలు
- డీజిల్‌కు కూడా డబ్బులు లేకపోవడంతో మూలనపడ్డ ట్రాక్టర్లు
- అధ్వానంగా మారిన పారిశుధ్యం

ప్రత్యేకాధికారులుగా నియమించిన తర్వాత నెలరోజులపాటు వారంలో రెండు, మూడు రోజులు వెళ్లిన ప్రత్యేకాధికారులు తదనంతరం గ్రామపంచాయతీల్లో నయా పైసా నిధులు కూడా లేకపోవడంతో పోవడం మానేశారు. జిల్లాస్థాయి మొదలుకొని మండలస్థాయి వరకు అన్ని శాఖల అధికారులకు గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు అప్పగించారు. ఆయా శాఖల్లోని రెగ్యులర్ పనులతోపాటు ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించి ప్రత్యేకాధికారి పనులను కూడా నిర్వహించాల్సిన పరిస్థితి. ఒక్కో అధికారికి రెండు గ్రామాలకు ప్రత్యేకాధికారిగా నియమించిన జిల్లా ఉన్నతాధికారులు పక్కపక్క గ్రామాలు కాకుండా ఆయా మండలాల్లోని అటు చివర, ఇటు చివర గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారుల బాధ్యతలు అప్పగించడం కూడా సమస్యగా మారింది. సోమవారం ప్రజావాణిలో ప్రత్యేకాధికారులుగా ఉన్న పలువురు జిల్లా అధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇందిరమ్మ ఇండ్లు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలను పట్టించుకుంటున్నారా, ప్రత్యేకాధికారులుగా ఉన్న గ్రామాలకు వెళ్తున్నారా అంటూ జిల్లా గనుల శాఖ ఏడీతోపాటు జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్, జిల్లా వ్యవసాయాధికారి తదితరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గత వేసవి సమయంలో గ్రామపంచాయతీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మరమ్మతుల పనులకు సంబంధించి పూర్తి చేసిన పనుల బిల్లులే రాకపోవడంతో ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీలవైపు చూడడం లేదనే వాదన వినిపిస్తున్నది. మరోవైపు ఎన్నికలు నిర్వహిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయనుకుంటే ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక లేకుండా ముందుకు వెళ్తుండడంతో ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారనేది స్పష్టత లేకుండా పోయింది.

అంతా అస్తవ్యస్తం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ గ్రామపంచాయతీలుగా రూపుదిద్దుకున్న గ్రామపంచాయతీల్లో పాలన పడకేసింది. పల్లెప్రగతి కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకువచ్చి దేశంలో ఎక్కడాలేని విధంగా పచ్చని పల్లెలుగా అవార్డులను సొంతం చేసుకున్న గ్రామపంచాయతీల్లో పాలన ఏడాదిలో అస్తవ్యస్తమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నయా పైసా నిధులివ్వకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. ప్రత్యేకాధికారులను నియమించడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. వేసవికాలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చేసిన మరమ్మతులు, తదితర పనులకు సంబంధించి స్థానికంగా చిన్నచిన్న కాంట్రాక్టర్లు చేసిన ఖర్చు రూ.4 కోట్ల నిధులు కూడా ఇప్పటివరకు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీలు దేశంలోనే ఆదర్శంకాగా, ప్రస్తుతం పరిస్థితి అధ్వానంగా మారింది. గతేడాదిగా పంచాయతీ కార్మికులకు జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం డ్రైనేజీ పైప్‌లైన్‌లకు కూడా మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొనడంతో గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అద్దంలా మెరిసిన గ్రామపంచాయతీల్లోని రోడ్లు ప్రస్తుతం మురుగునీటితో దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు వర్షాలు పడుతుండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఇచ్చిన ట్రాక్టర్లు ప్రస్తుతం మూలన పడ్డాయి. ట్రాక్టర్లకు ఈఎంఐ కట్టలేని పరిస్థితితోపాటు కనీసం డీజిల్‌కు కూడా డబ్బులు లేకపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. ట్రాక్టర్లు మూలన పడటంతో ఇంటింటికెళ్లి తడి–పొడి చెత్త సేకరించే ప్రక్రియ కూడా గ్రామాల్లో నిలిచిపోయింది.

తిర్మలాపూర్ గ్రామపంచాయతీ సమీపంలో చెత్తాచెదారం

యూసుఫ్‌గూడలోని బస్తీ దవాఖాన

సర్కారు విద్య మిథ్యేనా..?

- ప్రభుత్వ పాఠశాలల్లో రోజు రోజుకూ తగ్గుతున్న మౌలిక వసతులు
- ఏడాదిన్నరగా అందని అల్పాహారం
- సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ సర్కారు
- బడి బాటనూ సక్రమంగా నిర్వహించని ఉపాధ్యాయులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపిస్తున్న విద్యార్థులు
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో అన్ని రకాల వసతులు
- పెరిగిన బోధనా ప్రమాణాలు.. పెద్ద సంఖ్యలో ప్రవేశాలు

ఇబ్రహీంపట్నం, జూన్ 8 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెరుగైన వసతులను కల్పించడం ద్వారా ప్రభుత్వ బడులకు ఆదరణ పెద్ద ఎత్తున పెరిగి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దఎత్తున చేరారు. జిల్లావ్యాప్తంగా పేద విద్యార్థుల ముంగిటకే కార్పొరేట్ విద్యను గత ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి వారికి కొండంత అండగా నిలిచింది. అనేక సంస్కరణలు చేపట్టి విద్యావ్యవస్థను గాడిలో పెట్టడంతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉత్తీర్ణత శాతం కూడా గణనీయంగా పెరిగింది. ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం సన్నబియ్యంతో భోజనం, రెండు జతల స్కూల్ యూనిఫాం, టై, బెల్టులు, షూలతోపాటు పుస్తకాలు ఇలా అన్ని రకాల వసతులను పేద విద్యార్థులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేసింది. కాని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సర్కారు బడులపై చిన్నచూపు చూస్తున్నది. సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం చేస్తున్నది. విద్యార్థులకు అల్పాహారాలు లేకుండానే పాఠశాలలను నడుపుతున్నారు. దీంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలనే ఉద్దేశంతో శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. దీంతోనైనా ప్రభుత్వ పాఠశాలలు బాగుపడతాయా అంటే.. ఇప్పటికీ ఎలాంటి మార్పు రాలేదు. ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

బడిబాటతో విద్యార్థుల సంఖ్య పెరిగేనా..?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్నతాశయంతో చేపట్టిన బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వేలాదిమంది బడీడు పిల్లలను బడుల్లో చేర్పించగలిగారు. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ సంవత్సరం కూడా చేపడుతున్న బడిబాట కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పెరుగతాయా అనేది సందిగ్ధంగా మారింది. గతేడాది నుంచి విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. ప్రస్తుతం బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయులు తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకొంటున్నందున విద్యార్థులు ప్రభుత్వ బడులను మరిచి ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

బడిబాట పకడ్బందీగా నిర్వహించాలి

ప్రభుత్వం బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాల్లో తూతూమంత్రంగా బడిబాటను నిర్వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో చేరిన విద్యార్థులు సర్కారు బడుల్లో నెలకొన్న సమస్యల కారణంగా ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను ఎంతో బలోపేతం చేసినప్పటికీ ఆ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

- పెట్టల నిరంజన్

మౌలిక వసతులు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని నెరవేర్చడంలేదు. ప్రభుత్వ విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వర్యీం చేస్తున్నది. పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్నందున అన్ని రకాల వసతులు కల్పించాలి.

- శ్రీనాథ్, విద్యార్థి సంఘం నాయకుడు

వేతనాలు అందక వెతలు

- బస్తీ దవాఖానల్లో పెండింగ్‌లోజీతాలు
- ఇబ్బందులు పడుతున్న వైద్య సిబ్బంది
- కుటుంబం కోసం అప్పులు చేస్తున్న వైనం
- గత ప్రభుత్వంలో సకాలంలో వేతనాలు
- కాంగ్రెస్ పాలనలో తీవ్ర జాప్యం

సిటీబ్యూరో/జుబ్లీహిల్స్, జూన్10 (నమస్తే తెలంగాణ): బస్తీవాసులకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉచితంగా వైద్యసేవలందించే బస్తీ దవాఖానలు కాంగ్రెస్‌పాలనలో నిర్వీర్యమయ్యాయి. నాణ్యమైన వైద్య సేవలందించడంలో విఫలమవ్వగా, పని చేసే సిబ్బందికి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా పెండింగ్ వేతనాలు ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 450 బస్తీ దవాఖానలు ఉండగా, గ్రేటర్ పరిధిలోనే 300 బస్తీ దవాఖానలు పేద ప్రజలకు వైద్య సేవ లందిస్తున్నాయి. ప్రతి బస్తీ దవాఖానలో మెడికల్ అధికారి, స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్‌తో కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా 1300కు పైగా వైద్యసిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా వేతనాలు రాక కుటుంబాలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజల చెంతకు వైద్యమందించాలని నాటి బీఆర్ఎస్ సర్కార్ పట్టణాల్లో బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసింది. కేసీఆర్ అధికారంలో ఉన్న రోజుల్లో వాటిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండేది. సిబ్బంది వేతనాలు, కావాల్సిన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేవి. కాంగ్రెస్ పదిహేను నెలల పాలనలో వైద్యరంగాన్ని పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేసింది. గ్రేటర్‌లో ఉన్న బస్తీ దవాఖానల్లో ప్రస్తుతం సరిపడా మందులు లేక, ప్రైవేట్ ఫార్మసీలను ఆశ్రయిస్తున్న తరుణం ఏర్పడింది. సిబ్బందికి వేతనాలు చెల్లించాలంటే ఖాజానా ఖాళీ అయిందంటూ తప్పించుకు తిరుగుతున్నది.

అప్పులు చేస్తున్న సిబ్బంది

గతంలో హరీశ్‌రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు వైద్యసిబ్బందితో నిత్యం సమీక్షలు నిర్వహించిన సందర్భాల్లో వారి బాగోగులు సైతం వాకబు చేసేవారు. జీతభత్యాల గురించి తెలుసుకునేవారు. ఒక వేళ సకాలంలో వేతనాలు రాలేదంటే కారణాలు తెలుసుకొని అప్పటికప్పుడు పరిష్కరించేవారు. ప్రస్తుతమున్న ఆరోగ్యశాఖ మంత్రి వీటన్నటికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన సందర్భంగా పెండింగ్ వేతనాల గురించి వైద్యసిబ్బంది అడగగా, సమీక్షకు హాజరైన వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇన్ని నెలల నుంచి సిబ్బంది వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలియదని సమాధానం దాటవేశారు. సిబ్బంది వేతనాలపై అధికారులకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయకపోవడంతో బస్తీ దవాఖానల్లో పనిచేసే సిబ్బంది నిరాశకు గురయ్యారు. హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో ప్రతినెలా ఇంటి అద్దెలు, ఈఎంఐలు, నిత్యావసర సరుకులు కొనాలంటే వైద్య సిబ్బంది అప్పులు చేస్తున్నారు.

బోనాలకు గ్రేటర్ ముస్తాబు

- ఈ నెల 26న ఆషాఢ బోనాల జాతర
- జూలై 24న ఉత్సవాల ముగింపు
- ఏర్పాట్లపై అధికారులతో మంత్రుల సమీక్ష

సిటీబ్యూరో, జూన్ 10 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పేలా బోనాల ఉత్సవాలకు గ్రేటర్ ముస్తాబవుతున్నది. ఈ నెల 26న గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జూలై 1న బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, 13న ఉజ్జయినీ మహంకాళీ బోనాల జాతర, 14న రంగం, 20న పాతబస్తీ అక్కన్న, మాదన్న బోనాల జాతర, జూలై 24న బోనాల ఉత్సవాలు ముగియనున్నాయి. ఇందులో భాగంగా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంగళవారం జూబ్లీహిల్స్ ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో ఆషాఢ మాసం బోనాల ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులకు మంత్రులు సూచనలు చేశారు. బోనాల బందోబస్తు, తాగునీరు, పారిశుధ్యం, ఎలక్ట్రిసిటీ అన్ని విభాగాలతో సమీక్ష చేపట్టనున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. దాదాపు 3,026 దేవాలయాలు బోనాల ఉత్సవాల్లో భాగస్వామ్యమవుతున్నాయని, ఈ దేవాలయాలకు ప్రతి సంవత్సరం ఇచ్చే నిధుల్లో 10 శాతం పెంచడం జరుగుతుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఏవైనా దేవాలయాలకు నిధులు రాకుంటే దేవాదాయశాఖకు అప్లికేషన్ పెట్టుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డీజీపీ జితేంద్ర, సీపీ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.